క్లుప్తంగా

గిరి బలిజను రద్దు చేయరూ!

శ్రీకాళహస్తి: గిరి బలిజను రద్దు చేయాలని బలిజసేన అధ్యక్షుడు కుప్పాల వెంకటేష్(దుమ్ము రాయల్) బుధవారం తహసీల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. దొమ్మరి కులానికి బలిజ కులం వ్యతిరేకం కాదని, వారిని కూడా గౌరవిస్తూ మరొక పేరు సూచించాలని,. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి గిరి బలిజను రద్దు చేయాలని కోరారు. భాస్కర్, నరేంద్ర, రమణగారి మురళి, జాజాల ముని, రమణగారి అనిల్, సతీష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పాల్గొనాలి

వరదయ్యపాళెం: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నవభారత నిర్మాణానికి కృషి చేయాలని వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వీఎస్ రవి పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధమ్మ, అధ్యాపకులు సాహుల్, దమయంతి, శశికళ, శాంతకుమారి పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠాపన


విశేష అలంకరణలో సత్తెమ్మ

రేణిగుంట: స్థానిక భగత్ సింగ్ కాలనీలోని సత్యమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు నూతనంగా తయారుచేసిన అమ్మవారి పంచలోహ విగ్రహానికి అర్చకులు విశేష అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని రాగి, వేప చెట్లకు కల్యాణోత్సవం చేశారు.

విజయవాడ కనకదుర్గమ్మకు ముక్కంటి పట్టువస్త్రాలు


పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మకు ముక్కంటి ఆలయం తరపున బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఈఓ బాపిరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. వీరిని వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వాస్పత్రికి అనారోగ్యం



మూత లేని నీటి ట్యాంకు, ప్రభుత్వాస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న వస్తువులు

- ఎప్పుడూ రెఫర్లే..!
- తగ్గిన రోగులు, కాన్పుల సంఖ్య
- ఎటుచూసినా అపరిశుభ్రతే

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని నిర్లక్ష్య రోగం పీడిస్తోంది. ఆస్పత్రిని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రజాప్రతినిధులు ప్రకటించడం తప్పితే ఆచరణలో విఫలమయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 11 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రి స్థాయి నుంచి 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావాల్సింది పోయి రోజురోజుకూ రెఫర్లు పెరిగిపోతున్నాయి. కాన్పుల సంఖ్య గతంతో పోలిస్తే తగ్గాయి.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి ఆస్పత్రిలో నెలకు సుమారు 150 నుంచి 200 కాన్పులు అయ్యేవి. ఏడాది కాలంగా 30 కాన్పులు కూడా కావడంలేదు. ఎక్కువగా రెఫర్ చేస్తూ సులభమైన కేసులు మాత్రమే ఇక్కడ చేస్తున్నారు. చిన్న కాంప్లికేషన్స్ వచ్చినా రెఫర్ చేస్తున్నారు. గతంలో ఈ రెఫర్ల వల్ల ఇద్దరు తల్లులకు కడుపుకోత మిగిలింది. ఆలస్యంగా రెఫర్ చేయడంతో తిరుపతికి వెళ్లే లోపు చనిపోయిన ఉదంతాలు గతంలో చోటుచేసుకున్నాయి.

ఏడాదిన్నరగా అభివృద్ధి శూన్యం

గత ప్రభుత్వంలో రూ.11 కోట్లు పెట్టి అభివృద్ధి చేస్తే, కూటమి ప్రభుత్వం కనీసం అంతర్గత రోడ్లను కూడా వేసిన పాపానపోవడం లేదు. ఫలితంగా ఎటు చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. అంబులెన్సు నుంచి రోగిని స్ట్రెచర్ మీద ఆస్పత్రిలోకి తీసుకెళ్లేందుకు తిప్పలు పడాల్సి వస్తోంది. ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తామంటున్న అధికారులు, పాలకులు దీనిని మాత్రం పట్టించుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

ఇదేనా చికిత్స..?

ఇటీవల ఓ వ్యక్తి గాయపడి ఆస్పత్రికి వస్తే వైద్యులు పరీక్షించకుండానే చూసి వెళ్లిపోయారు. అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది గాయపడిన వ్యక్తి తలకు మూడు కుట్లు వేయడం గమనార్హం!

వర్షమొస్తే రొచ్చు.. రొచ్చే..!

ఇక వర్షం కురిస్తే ఆస్పత్రి ఆవరణలో నీరు నిలిచిపోయి అపరిశుభ్రత, దోమలమోతకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.


ఆస్పత్రి ఆవరణలో నిలిచిన వర్షపునీరు

తాండవిస్తున్న అపరిశుభ్రత

అసలే పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది ఆస్పత్రిపై భాగంగా ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులకు మూతలు లేవు. దీంతో కోతులు ఎంచక్కా వాటిలో ఈత కొడుతున్నాయి. అలాగే కొన్ని పక్షులకు కూడా ఇది ఆటవిడుపుగా మారింది. పాచి పట్టి అధ్వానంగా ఉంది. మూత లేని కారణంగా కోతులుకానీ మరేవైనా అందులో చనిపోతే ఇక నీటి పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో మోతి సిబ్బందిని ఆదేశించారు. ఆమె బుధవారం ఏపీవో దేవరితో కలిసి ఆర్ అనంతాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు.

పీ-4తో పేదరిక నిర్మూలన

బుచ్చినాయుడుకండ్రిగ: పీ-4 సర్వే ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఎంపీడీవో మోతి తెలిపారు. ఆమె బుధవారం గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో పీ-4 సర్వేపై సమావేశం నిర్వహించారు. మండలంలో వెనుకబడిన 1,690 కుటుంబాలను గుర్తించినట్టు తెలిపారు. ఎంఈవో రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్, డ్రైవర్ కోసం పడిగాపులు!

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ఏపీ 39 జడ్ 0088 నంబరు గల శ్రీకాళహస్తి-పిచ్చాటూరు (వయా కోట మంగాపురం) బస్సు ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చింది. ప్రయాణికులు బస్సు ఎక్కి కూర్చున్నారు. గంట పాటు డ్రైవర్, కండక్టర్ కనిపించలేదు. దీంతో బస్సులోని చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు, ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

అన్నమాచార్య విద్యార్థుల ప్రతిభ


కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

రేణిగుంట: మండలంలో వెంకటాపురం సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎల్.ప్రేమ్ కుమార్, బి.సుజిత్‌కుమార్ జేఎన్టీయూఏ వర్సిటీ స్థాయి సెలెక్షన్స్‌లో ప్రతిభ చాటి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నీ ఎంపికయ్యారు. వారిని బుధవారం ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాదమునిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణంరాజు, కో-ఆర్డినేటర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

తొట్టంబేడు: వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన చింతా రాజేంద్ర ఉమ్మడి జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడును బుధవారం ఆత్మీయంగా సన్మానించారు. తనకీ పదవి రావడానికి ఉన్నం కారణమని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మూరు సురేష్, గంధం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

రేణిగుంట: జీఎస్టీ రేట్లు తగ్గించిన ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు చెబుతూ బుధవారం రేణిగుంటలో బీజేపీ, టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జీఎస్టీ జిల్లా కన్వీనర్ బీడీ బాలాజి, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగరం సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ పుష్పనాథన్, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజా రాయల్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నాగలాపురం: మండలంలోని మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం నాగలాపురం సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం వుంది. ఇక్కడ రోజుకు 20 మందికి మించి సేవలు అందించడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గతంలోలా నందనం, బీరకుప్పం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


అధినేతతో నూకతోటి రాజేష్, బీరేంద్ర వర్మ

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌కు దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో రాజేష్ పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, రాజకీయ పరిణామాలను వివరించారు. నాయకుల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.

పాహిమాం పరమేశ్వరి

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అమ్మవార్లకు వేర్వేరు అలంకారాలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ తపస్సు అలంకారంలో.. కనకాచలంపై వున్న కనకదుర్గమ్మ గాయత్రీ దేవిగా, నాగలాపురం మండలం సురుటుపల్లిలోని సర్వమంగళా సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మరగదాంబిక అలంకరణలో దర్శనమిచ్చారు.

–శ్రీకాళహస్తి / నాగలాపురం / సత్యవేడు / నారాయణవనం



అన్నపూర్ణాదేవిగా పొన్నాలమ్మ, నారాయణవనం: పార్వతీ దేవిగా అవనాక్షమ్మ





నారాయణవనం: అన్నపూర్ణగా ద్రౌపదీదేవి, రాజరాజేశ్వరిగా మూలస్థాన ఎల్లమ్మ, శ్రీ మీనాక్షి అలంకరణలో మరగదాంబికై అమ్మవారు, సత్యవేడులో అన్నపూర్ణదేవిగా సర్వమంగళాదేవి





అన్నపూర్ణాదేవిగా వేడాం దక్షిణ కాళికాదేవి, కూష్మాండ అలంకారంలో ఏడుగంగలమ్మ, బ్రహ్మచారిణి అలంకారంలో ముత్యాలమ్మ, గాయత్రిదేవి అలంకారంలో ఆలయంలోని కనకదుర్గమ్మ